# మచ్చ

శశాంక్ లాంటి వ్యక్తుల్ని చూసినపుడు చాలా ముచ్చటేస్తుంది. కించిత్తు గర్వం కూడా కలుగుతుంది. సమాజంలో ఇంకా మంచితనం, మానవత్వం మనుగడ సాగిస్తున్నాయంటే శశాంక్ లాంటి ఆదర్శ జీవుల చలవే అనిపిస్తుంది.

మా ఇద్దరిదీ బహుశా ఒకే వయసు. దాదాపు నలభై. అయినా శశాంక్ అలా కన్పించడు. పాతికేళ్ళ కుర్రాడిలా ఉంటాడు. విశాలంగా, అందంగా నవ్వే కళ్ళు - కొనదేలిన ముక్కు -పట్టుదలను సూచించే గడ్డం - మనిషి ఆజానుబాహువు. ఎత్తుకు తగ్గ లావు, దబ్బపండులాంటి శరీరఛాయ. ఆడపిల్లల మాటేమో కానీ మగాళ్ళు కూడా చూపు త్రిప్పుకోలేనంత అందం.

స్వతహాగా ఇంట్రోవర్ట్‌నయిన నాకు శశాంక్‌తో పరిచయం జరగటం ఓ అద్భుతమైన విషయమే. నా చుట్టూ గిరిగీసుకుని - ఏకాంతాన్ని ఇష్టపడే నేను - వ్యక్తి ఆరాధనని గర్హిస్తాను. శశాంక్ గురించి ప్రతిరోజూ పేపర్‌లో ఏదో న్యూస్ వస్తోనే ఉంటుంది. కానీ పేపర్ చదవటం మానేసిన నాకు ఆ విధంగా శశాంక్ తెలిసే అవకాశం లేదు. ఉద్యోగం రాక ముందు ఇంటర్వ్యూల కోసమని అయిష్టంగానే పేపర్ చదివేవాడిని. ఏముంటాయి పేపర్లలో - హత్యలూ, మానభంగాలూ, దోపిడీ, దౌర్జన్యాలూ, పాలకుల లొసుగులూ, ప్రజల్లోని అశాంతి, అలజడి. . . . ఎంత విసుగో నాకు.

నా ప్రపంచం వేరు. రంగుల ప్రపంచం. ఏదైనా నిర్జన ప్రదేశంలో - ప్రకృతి

ఒడిలో - నా కుంచెల్తో, కాన్వాస్ మీద మాట్లాడు కోవటంలో బోల్డంత తృప్తి నాకు. నా వృత్తికీ, ప్రవృత్తికీ హస్తిమశకాంతరం. నా మనసెపుడూ రంగు రంగుల అందమైన ఊహల్లో విహరిస్తే - ఉద్యోగం . . . . దుమ్ము పట్టిన ఫైళ్ళూ - బాసిజం - రెడ్ టేపిజం- నా కెంత అసహ్యమో. కానీ తప్పదు. జీవితంలో కొన్ని చోట్ల కొన్నిటితో రాజీపడక తప్పదు.

ఆఫీసు పనిమీద శశాంక్‌ని కల్సుకున్న రోజు మొదటిసారిగా అతని గురించీ, సగం భారతదేశం విస్తరించి ఉన్న అతని మహోన్నత సంస్థ గురించి వినే మహద్భాగ్యం కలిగింది. ఇంత చిన్న వయసులోనే అంతటి మహత్తరమైన కార్యాల్ని సాధించిన శశాంక్ మీద ఎనలేనంత గౌరవం ఏర్పడింది.

పేదల కోసం నడుపుతున్న పాఠశాలలు, గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సదుపాయం, వితంతు వివాహాలూ - వారి పునరావాస సౌకర్యం - అనాధ శరణాలయాలూ. . . . ఇలా ఎన్నెన్నో . . . .

అఫిషియల్ సంబంధాల్ని ఆమడ దూరం ఉంచే నేను - శశాంక్ విషయంలో అలా ఉండలేక పోయాను. ఆఫీస్ పనంటూ ఏమీ లేకున్నా అతని కోసమని వెళ్ళాను. అతనిలో ఏదో అద్భుతమైన ఆకర్షణ ఉంది. అది ఆ నవ్వే కళ్ళలో ఉందో - అమృతంలాంటి పలుకుల్లో ఉందో - విద్యుత్తులా కదిలే అతని చురకుతనంలో ఉందో తెలియదు.

ఈసారి వెళ్ళినపుడు శశాంక్ లేరు. క్యాంప్‌లో ఉన్నారని తెల్సింది. ఆఫీస్ ఉద్యోగుల్లో ఆటవిడుపుతనం కన్పించింది. ఆఫీసు శుభ్రంగా - అందంగా అమర్చి ఉంది. చూడగానే కూచునిపని చేయాలనిపించేట్లు ఉన్నాయి కుర్చీలు, బల్లలు. చప్పున నాకు మా వదినగారి కజిన్ గుర్తొచ్చాడు. డిగ్రీ పాసయినా ఉద్యోగం, సద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. గవర్నమెంటు ఉద్యోగాలకు కావల్సిన వయసు కూడా దాటిపోయినట్లుంది. ఎన్నిసార్లు నాతో చెప్పినా, సహజంగా ఉండే నిర్లిప్తత కొద్దీ

పట్టించుకోలేదు. ఎలాగూ శశాంక్ కూడా లేరు కాబట్టి కొన్ని వివరాలు సేకరించటం మంచిదనిపించింది.

ఆఫీస్‌లో ఒకరిద్దరిని కదిలించాను.

"ఖాళీలకేం - బోల్డుంటాయి" అన్నాడొకతను వెటకారంగా.

"అలానా - కాదు మరీ - పేదల సేవకు పరిమితి అంటూ ఏం ఉంటుంది" అన్నాను.

"అబ్బే. . .అలా కాదండీ. . ఇక్కడెవరూ నాలుగయిదు నెలలకు మించి పనిచేయలేరు. అందుకు".

"అదేం - వేరే గవర్నమెంటు ఉద్యోగాలొచ్చి వెళ్ళిపోతుంటారా".

"అంత అదృష్టం కూడానా - ఇక్కడ పనిచేయటం కంటే నిరుద్యోగిగా ఉండి పస్తులు పడుకోవటం నయం" అక్కసునంతా మాటల్లోనే కాకుండా ముఖ కవళికల్లో కూడా చూపించి చెప్పాడు.

నా మనసు చివుక్కుమంది. ఇంత గొప్ప సంస్థలో అందునా అంత మంచి వ్యక్తి దగ్గర పనిచేయటమే అదృష్టం అని భావిస్తుంటే వీళ్ళిలా అనటం బాధ కలిగించింది.

"జీతాలు సరిగ్గా ఇవ్వరా" అన్నాను.

"ఎందుకివ్వరు - ఠంచనుగా ఇస్తారు. వీళ్ళిచ్చే బోడి అయిదారు వందల జీతం ఏమూల కొస్తుందీ. . . . దాని కోసం ఎంత వెట్టి చాకిరీ - మరెంత గొడ్డుచాకిరీ చేయాలో. . . . దొరగారు కారులోనో, ట్రెయిన్‌లోని ఏసీ రూంలోనో కూచుని వస్తారు. మేం మాత్రం చచ్చీ చెడీ వెళ్ళాలి. ఆ పల్లెటూర్లలోని మురికివాడల్లో పడుకోవాలి. మా అతీగతీకనుక్కునే నాథుడే ఉండడు. తిండీ తిప్పలు ఉండవు. ఇంతకీ మీరుచేర్చాలనుకుంటుంది అబ్బాయినా, అమ్మాయినా"

"అబ్బాయినే - ఏం నాయనా" అన్నాను అనుమానంగా.

"అబ్బాయి అయితే ఎంత కండపుష్టి ఉన్న వాడైనా మూణ్ణెల్లలో పూచిక పుల్లలా అయిపోవటమో. . . . ఏ అంటు రోగాలకో బలైపోవటమో ఖాయం. అమ్మాయి అయితే మూణ్ణెల్లకే. . . ." ఆపేసి పక్కతని వైపు తిరిగి కిసుక్కున నవ్వాడు.

నాకు అర్థమైనా బ్లాంక్‌గా అతని వైపు చూశాను.

"నమ్మకం లేదా మాష్టారూ - ఆఫీస్ అంతా ఓసారి పరిశీలించి చూడండి. ముప్పావు మంది ఆడంగులే... ఇంకో విషయం గమనించారా - అందరూ అందంగా, మంచి వయసులో ఉన్నవాళ్ళే - ఇక్కడ ఉద్యోగం దొరకాలంటే అదే అసలైన క్వాలిఫికేషన్ - మీరు మరో నెల ఆగి రండి. ఇందులో సగం మంది రిజైన్‌చేసి ఉంటారు. కొత్త మొహాలు - కొత్త రుచులూ - అదండీ అదృష్టం అంటే. . ."

నాకిలాంటి గాసిప్స్ నచ్చవు. అసహ్యం కూడా. అందుకే అరుచిగా మొహం పెట్టి లేచాను.

"చూడబోతే మీరు కూడా అతని అందమైన మొహం - అమాయకమైన చిర్నవ్వు చూసి బోల్తా పడ్డట్టున్నారు. తెల్లనివన్నీ పాలు కావండీ. లేకపోతే నలభైయేళ్ళు దాటినా పెళ్ళెందుకు చేసుకోలేదూ?"

"జీవితాన్ని ఓ సదాశయం కోసం అంకితం చేశారు కాబట్టి" అని చెప్పాలనుకున్నా . . . . చెప్పినా వ్యర్థమే - ఇలాంటి వాళ్ళకు అర్థం కాదు. సగం నిండిన గ్లాసులో సగం ఖాళీని మాత్రమే చూడగల మూర్ఖులు వీళ్ళు.

నేను సమాధానం చెప్పకుండా వచ్చేసినా అప్పటి నుండి ఓ రకమైన వెలితి నాలో మిగిలిపోయింది. మనసులోని శశాంక్ మీది గౌరవంలో అకస్మాత్తుగా ఏర్పడిన శూన్యస్థానం . . . . చాలా అనీజినెస్ . . . .

ఓ వారం తర్వాత శశాంక్ ఉన్నారని తెలిసి - కల్సుకోడానికి వెళ్ళాను. అదే

చిర్నవ్వు - అదే నిర్మలత్వం - పాపుల కోసం రక్తం చిందించిన క్రీస్తులా - మొదట తక్కువ జీతాల గురించి అడిగాను.

"మా సంస్థకు వచ్చే నిధులన్నీ పేదల కోసం నిర్దేశించబడ్డవే. అందులో ఎక్కువ భాగాన్ని జీత భత్యాల మీద, అడ్మినిస్ట్రేషన్ నిమిత్తం వ్యయం చేసేస్తే చివరికి ఆపదల్లో ఉన్న వాళ్ళకు ఏం చేరుతుంది? అందుకే ఉద్యోగాల కోసం ప్రకటించేటపుడు స్పష్టంగా తెలియబరుస్తాం. పేదల కోసం శ్రమించాలన్న సదుద్దేశంఉన్నవాళ్ళే కావాలని - ఓ విధంగా శ్రమదానంచేసే వాళ్ళనే తీసుకుంటాం. జీతం నామ మాత్రమేనని ముందేచెప్తాం. అన్నిటికీ ఇష్టపడి చేరతారు. ఆ తర్వాత . . . ." నా వైపు చూసి అందంగా నవ్వి ఆగిపోయారు.

చక్కటి వివరణ. ఛారిటబుల్ సంస్థలో లాభాల ప్రమేయం ఎలా ఉంటుంది? జీతాల మీద ఎంత తక్కువ ఖర్చు చేస్తే - అంత ఎక్కువగా అన్నార్తుల్ని ఆదుకోవచ్చు.

మరి ఆడపిల్లల విషయం? అది చాలా వ్యక్తిగతమైన ప్రశ్న. నాకంతగా చనువు లేదు. అయినా అలాంటివి మన సంస్కారాన్ని బట్టి అర్థం చేసుకోవాల్సిన విషయాలు తప్ప అడిగి తెల్సుకోవల్సినవి కావు.

నేను మరి కొంతసేపుండి, శెలవు తీసుకుని వచ్చేశాను.

గుండెలోని బరువు కొద్దిగా తగ్గినట్లే అనిపించింది.

ఎప్పుడూ ల్యాండ్ స్కేప్స్‌నే చిత్రించే నాకు వ్యక్తుల బొమ్మలు వేయటం ఇష్టం ఉండదు. అయినా శశాంక్ మీద నాకున్న గౌరవాన్ని చాటుకోడానికి వారి చిత్రపటం గీయటం ప్రారంభించాను. పని వత్తిడివల్ల ఓ నెలకు కాని అది పూర్తి కాలేదు. ఆ చిత్ర పటాన్ని అందంగా ప్యాక్ చేసి వారి ఆఫీసుకు బయల్దేరాను.

నేను వెళ్ళేటప్పటికి ఆఫీసంతా గొడవగొడవగా ఉంది. మెలితిప్పిన మీసాల్తో భయంకరంగా ఉండే మేనేజరు ఆవేశపడ్తున్న వాళ్ళందరికీ ఓపిగ్గా సమాధానం చెప్తున్నాడు. విషయం ఏమిటో తెలుసుకోవడానికి పది నిముషాలు పట్టింది. అక్కడో

అందమైన పాతికేళ్ళ అమ్మాయి నిలబడి ఏడుస్తోంది. కనకాంబరం రంగు చీరలో నాజూగ్గా, లేతగా కనకాంబరం పూవులా ఉందామె. ఎర్రబడిన ఆమె కళ్ళు విరిసిన మందారాల్లా ఉన్నాయి.

ఆమెను గదిలోకి పిల్చి శశాంక్ అసభ్యంగా ప్రవర్తించారట. అదీ గొడవ. పద్మవ్యూహాన్ని ఛేదిస్తున్న అభిమన్యుడిలా మేనేజర్ చాలా ఎఫిషియంట్‌గా అందర్నీ ఎదుర్కొంటున్నాడు.

"ఇలాంటివి కొత్తయితే గదా - నెలకోసారయినా ఏదో గొడవ జరగటం - దాన్ని సర్దిచెప్పటం - మేనేజర్‌కి అలవాటైంది. అందుకే చూశావా - అందరూ అలా రెచ్చిపోతున్నా ఎంత నింపాదిగా, ఓపిగ్గా సమాధానం చెప్తున్నాడో" అన్నారెవరో గుంపులోంచి.

నా ప్రశ్నకు అడక్కుండానే సమాధానం దొరికినట్లయింది. శశాంక్ గార్ని కలవాలా వద్దా అని ఓ క్షణం సంశయించినా - అలా కల్సుకోవడం వల్ల మరికొన్ని ప్రశ్నలకు వాటంతటవే సమాధానాలు దొరుకుతాయేమోనన్న ఆశతో లోపలికి వెళ్ళాను.

శశాంక్ చాలా ప్రశాంతంగా ఫైళ్ళు చూసుకుంటున్నారు. ఎయిర్ కండిషన్డ్ గది లోపల ఏం జరిగినా బైటికి విన్పించే అవకాశం లేదు. అలానే లోపల ఏమీ జరక్కున్నా జరగలేదని ఖచ్చితంగా తెలిసే అవకాశమూ లేదు.

అదే చిర్నవ్వుతో చిత్రపటాన్ని తీసుకుని ధన్యవాదాలు చెప్పారు. వారిలో ఏ రకమైన తొట్రుపాటు - ఆందోళన - అపరాధభావన నాకు కన్పించలేదు. నిర్మలంగా-పవిత్రంగా - పరిశుద్ధాత్మలా. . . .తప్పు చేసి ఉంటే ఆ నవ్వులో కాంతి ఎలా ఉంటుంది? ఆ మొహంలోని తేజస్సు చెక్కు చెదరకుండా అలానే ఉండటం ఎలా సంభవం?

బైట అంతా యధావిధిగా పనులు జరుగుతున్నట్లే శశాంక్ తాపీగా మాట్లాడారు. బైట అంత గొడవ జరుగుతున్నప్పుడు అక్కడ ఎక్కువసేపు కూచోవటం సభ్యత కాదనిపించి శెలవు తీసుకున్నాను. మేనేజర్ ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు. ఆ అమ్మాయి

ఏడుస్తూనే ఉంది.

"ఆడపిల్లల జీవితాలంటే వాడికంత చులకనగా ఉందా - బైటికి రమ్మనండి. వాడి అంతు చూస్తాం" అని అరుస్తున్నారు కొందరు.

ఆ అమ్మాయి కళ్ళలో నాకు కసీ - పగా కన్పించాయి తప్ప బాధ కన్పించలేదు. బహుశా నాకు శశాంక్ మీద ఉన్న గౌరవం వల్ల అలా అన్పించిందేమో.

నిజం ఏమైనా కావచ్చు. ఒక విధంగా చూస్తే తప్పు ఈ అమ్మాయిదే ఉండొచ్చు. మగవాళ్ళే కళ్ళు తిప్పుకోలేనంత అందగాడు - పెళ్ళికాని వాడు - సమాజంలో గౌరవ ప్రతిష్ఠలు కలవాడు - అటువంటి వ్యక్తిని పెళ్ళికాని ఆడపిల్ల ఆశపడటం చాలా సహజం. అందులో ఏదైనా ఎదురుదెబ్బ తగిలితే - ఇలా రచ్చకీడ్చిందేమో. . . . ఏమో . . . . అసలు శశాంక్ అలాంటి వారేమో. . . . అయినా అలా అంటే నమ్మాలనిపించటం లేదు. నాలో ఏర్పడిన శూన్యాన్ని మోసుకుంటూ ఇంటికి బయల్దేరాను.

ఈ సంఘటన జరిగాక మరలా శశాంక్‌ని కల్సుకోవటం కుదరలేదు. ఆర్నెల్లు జరిగిపోయాయి. నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. హైద్రాబాద్ వదిలే ముందు శశాంక్ గారికి చెప్పటం అవసరమనిపించి, వారి ఆఫీసు కెళ్ళాను. లేరు - క్యాంపు కెళ్ళారేమోనని కనుక్కున్నాను. ఇంట్లో ఉన్నారని తెల్సింది. అడ్రస్ తీసుకుని బయల్దేరాను.

బంజారా హిల్స్‌లో ఉందా ఇల్లు. రాజభవనంలా. . . . లోపలికి వెళ్తుంటే ఉద్యానవనంలో నడుస్తున్నట్లే ఉంది.చుట్టూ అందమైన పూలచెట్లు - శశాంక్‌లానే ఇల్లు కూడా కళాత్మకంగా ఉంది.

బైట వరండాలో కుర్చీలేసుకుని కూచున్నాం. పనివాడు కాఫీలు తెచ్చి ఇచ్చాడు.

ఇంతలో గేటు దగ్గర అలజడి . . . . అసహ్యమైన పదాల్తో ఎవరో తిడ్తున్నారు. వాచ్‌మన్ వారిని లోపలికి రానీయకుండా ఆపుతున్నాడు. అతనికి సపోర్ట్‌గా ఇంట్లోని అరడజను పనివాళ్ళు గేటు దగ్గర కాపలాగా నిలబడ్డారు.

"పెళ్ళి చేసుకుని తగలడొచ్చుగా - గది శుభ్రం చేస్తున్న మా అమ్మాయిని

మంచం మీదకి లాగుతాడా. . . . వీడి చేతులిరిగిపోను" ఎవరిదో స్త్రీ గొంతు - ఓ స్త్రీ ఏడుపు - మగవాళ్ళెవరో బూతుల్తో తప్ప మాట్లాడటం లేదు.

శశాంక్‌వైపు చూశాను. అదే చిర్నవ్వు - అదే నిర్మలత్వం.

"మనం లోపలికి వెళ్ళి కూచుందాం" అన్నారు ప్రశాంతంగా.

లోపలికెళ్ళాక "మీరు హైద్రాబాద్ వదిలి వెళ్ళిపోతున్నారు. ఏమైనా అడగాలనిపిస్తే నిస్సంకోచంగా అడగండి" అన్నారు.

నా మనసులోని భావాల్ని చదివేసినట్లు అడిగారు. నాలోని అశాంతి - అలజడి అద్దంలోలా కన్పించి ఉంటాయి బహుశా.

అయినా ఏమని అడగను? ఎలా అడగను? అడిగినా నిజమే చెప్తారని ఏమిటి నమ్మకం? వచ్చిన సమాధానాన్ని నమ్మటం, నమ్మకపోవటం కూడా చివరికి మన సంస్కారం- ఆలోచనా విధానం - ఎదుటి వ్యక్తి మీద నమ్మకం - గౌరవం మీద ఆధారపడి ఉంటాయి. అటువంటప్పుడు మన మనసుకు తోచిన సమాధానం చెప్పుకోవటమే ఉత్తమం.

"అలాంటిదేమీ లేదండి - శెలవు" అని చేతులు జోడించాను. వారూ లేచి ప్రతి నమస్కారం చేశారు. కళ్ళు అద్భుతంగా నవ్వుతున్నాయి. ఎంతటి ప్రశాంతత ఆ వదనంలో. . . .

బైటకొస్తున్నప్పుడు ఆ అమ్మాయిని చూశాను. మంచి వయసులో ఉంది. వళ్ళంతా నిగారింపుతో మెరుస్తోంది. కొద్దిగా నలుపైనా శిల్ప సుందరిలా అందంగా ఉంది.

శశాంక్‌ని ఇష్టం వచ్చినట్లు తిడ్తున్నారు వాళ్ళందరూ. నేను చెవులు గట్టిగా మూసుకుని వచ్చేశాను.

నేను హైదరాబాద్ వదిలివస్తూ - నాతో పాటు అప్పుడేర్పడిన శూన్యాన్ని కూడా

తెచ్చుకున్నాను. ఓ రకమైన వెలితి - హృదయం మీద ఏర్పడిన చిన్ని మచ్చలా. . .

ఇప్పటికీ అనిపిస్తూ ఉంటుంది. ఆ రోజు వారు అడగమన్నప్పుడు అడిగి ఉంటే ఏం సమాధానం చెప్పి ఉండేవారోనని - ఏమో - కానీ అడక్కపోవటమే మంచిదయింది. మనసు మీద చిత్రించుకున్న అందమైన రంగుల పటం మీద కుంచెతో నల్లని మరకలు విసరటం ఎవరిష్టపడతారు?

● *మయూరి వీక్లీ, నవంబర్ 1, 1996* ●